సాక్షి
కాకినాడ
శుక్రవారం | 13 | డిసెంబర్ | 2024




ఎన్నికల్లో ఎన్ని వింతలో..
సాగునీటి సంఘాల ఎన్నికల్లో కొందరి ఇష్టారాజ్యం సాగుతోంది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇలాకా.. పిఠాపురంలో జరుగుతున్న ఈ తంతుపై రైతులు మండిపడుతున్నారు.

8లో



పురుగు మందు తాగి వ్యక్తి మృతి
నకాలంలో వైద్యం అందక పురుగు మందు తాగిన వ్యక్తి మృతి చెందాడంటూ గోకవరం ప్రభుత్వాసుపత్రి ఎదుట బంధువులు ఆందోళన చేపట్టారు.

డెల్టాలకు నీటి విడుదల
ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం తూర్పు డెల్టాకు 4,500, సెంట్రల్ 1,500, పశ్చిమ డెల్టాకు 5,500 క్యూసెక్కుల చొప్పున గోదావరి జలాలను వదిలారు. సముద్రంలోకి 6,384 క్యూసెక్కులు విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 10.90 అడుగులుగా ఉంది.



న్యూస్‌రీల్

పులీ.. ఉన్నావా.. దారి మళ్లావా..!



బాపన్నధార పరిసరాల్లో పులి కోసం గాలిస్తున్న అటవీ అధికారులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఉలిగోగుల రిజర్వు ఫారెస్టు పరిధిలోని బాపన్నధార లొద్దులో పెద్దపులి అలజడి సృష్టించి ఐదు రోజులవుతోంది. అటవీ అధికారులకు ఇప్పటి వరకూ దాని జాడ ఎక్కడా లభించలేదు. దాని ఆచూకీ కోసం అటవీ అధికారులు, సిబ్బంది ఉలిగోగుల రిజర్వు ఫారెస్టు పరిధిలోని బాపన్నధార, కొండపల్లి, బురదకోట, దారపల్లి తదితర గ్రామాల్లో ముమ్మరంగా గాలిస్తున్నారు. ఆరు ట్రాప్ కెమెరాలు అమర్చగా.. ఏ ఒక్క కెమెరాకు పులి చిక్కలేదు. దీంతో పులి ఉలిగోగుల రిజర్వు ఫారెస్టులో ఉందా లేక అక్కడి నుంచి దారి మళ్లిందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ధారపల్లి జలపాత మార్గం మూసివేత
పెద్దపులి సంచరిస్తున్న నేపథ్యంలో రక్షణ చర్యల్లో భాగంగా ధారపల్లి జలపాతం మార్గాన్ని అధికారులు మూసివేశారు. తాము మళ్లీ ప్రకటించేంత వరకూ ఎవరూ ధారపల్లి ప్రాంతానికి రావద్దని హెచ్చరించారు. బురదకోట గిరిజన గ్రామానికి సుమారు మూడు కిలోమీటర్ల పరిధిలో పెద్ద పులి ఉండే అవకాశం ఉండటంతో బాపన్నధార, కొండపల్లి, ధారపల్లి, బురదకోట గిరిజన గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. కొండ దిగువన బవురువాక, పాండవులపాలెం, తాడువాయి తదితర గ్రామాల ప్రజలను అప్రమత్తం చేసి, అత్యవసర పనులు ఉంటే మినహా రాత్రి వేళల్లో బయటకు రావద్దని సూచించారు. పశువులు, మేకలు, గొర్రెలను పొలాల్లో ఉంచవద్దని హెచ్చరించారు.

15న ఆత్మార్పణ దినం

కాకినాడ సిటీ: అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఈ నెల 15న ఆత్మార్పణ దినంగా పాటించాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వ శాఖల అధికారులను ఆదేశించారు. అన్ని కార్యాలయాల్లో పొట్టి శ్రీరాములు విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించాలని ఆదేశించారు.

15న జిల్లా జూనియర్ కబడ్డీ జట్ల ఎంపిక

సామర్లకోట: జిల్లా బాలుర, బాలికల జూనియర్ కబడ్డీ జట్ల ఎంపిక ఈ నెల 15వ తేదీ ఆదివారం జరుగుతుందని జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కొండపల్లి శ్రీనివాస్ గురువారం తెలిపారు. కాకినాడ పీఆర్ కళాశాల క్రీడా మైదానం, ఇండోర్ కోర్టు మ్యాట్‌పై ఈ ఎంపిక పోటీలు జరుగుతాయన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆధార్ కార్డుతో హాజరు కావాలన్నారు. 2005 జనవరి 12 తరువాత పుట్టిన 70 కేజీల్లోపు బాలురు, 65 కేజీల్లోపు బాలికలు మాత్రమే ఈ పోటీల్లో పాల్గొనడానికి అర్హులని వివరించారు. మ్యాట్ షూస్ తప్పనిసరిగా తీసుకు రావాలన్నారు. వివరాలకు 94911 01109, 99921 66997 మొబైల్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో సమస్యలు పరిష్కరించాలి



పీడీ ప్రవీణకు వినతి పత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ నాయకులు

కాకినాడ సిటీ: అంగన్‌వాడీ కేంద్రాల్లో సమస్యలు పరిష్కరించాలని జిల్లాలోని తొమ్మిది ప్రాజెక్టుల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కాకినాడలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు అధికారి కె.ప్రవీణకు గురువారం వినతిపత్రం అందజేశారు. హెల్పర్లకు ప్రమోషన్లు, రిటైరైన వారికి బెనిఫిట్లు ఇవ్వాలని కోరారు. కొంత మంది ఆయాలు, టీచర్లకు నెలల తరబడి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వీటిని వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కూరగాయల బిల్లు పెంచాలని, కాకినాడ అర్బన్‌లో రవాణా చార్జీలు ఇవ్వాలని, సామర్లకోట, కాకినాడ రూరల్, కరప, గొల్లప్రోలు, జగ్గంపేట తదితర మండలాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలను పింఛన్ల పంపిణీ విధుల నుంచి తొలగించాలని కోరారు. ఈ సమస్యలు పరిష్కరిస్తామని, తమ పరిధిలో లేనివి కలెక్టర్ దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని పీడీ ప్రవీణ హామీ ఇచ్చారని అంగన్‌వాడీ నాయకులు తెలిపారు. పీడీని కలిసిన వారిలో డి.పద్మావతి, ఎరుబండి చంద్రావతి, నీరజ, విజయ, ఎస్తేరురాణి, ధనలక్ష్మి, వీరవేణి, తులసి తదితరులున్నారు.



పంట పోయినా పట్టించుకునేవారేరీ..! : విపత్తుల వేళ జిల్లా రైతుల అవస్థలు

దగా పడిన అన్నదాత

- కూటమి పాలనలో రైతన్నకు తప్పని ఇక్కట్లు
- అడ్రస్ లేని 'అన్నదాతా సుఖీభవ'
- ఉచిత పంటల బీమాకు మంగళం
- 'అన్నదాతకు అండగా' వైఎస్సార్ సీపీ పోరుబాట
- నేడు కాకినాడలో పాదయాత్ర
- కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పణ

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ఆరుగాలం రెక్కలు ముక్కలు చేసుకుంటూ.. బంగారు పంటలు పండించే అన్నదాతలు.. ఇచ్చిన మాట నిలబెట్టుకోలేని చంద్రబాబు సారథ్యంలోని కూటమి పాలనలో అడుగడుగునా దగా పడుతున్నారు. అధికారంలోకి వస్తే వారి సంక్షేమానికి కృషి చేస్తామంటూ ఎన్నికల సమయంలో కూటమి నేతలు గుప్పించిన హామీలు నీటి మీద రాతలే అయ్యాయి. గద్దెనెక్కిన అనంతరం కూటమి సర్కార్ ఆరు నెలలుగా రైతుల సంక్షేమాన్ని విస్మరించడంతో సాగు సంకటంలో పడింది. రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీనీ ప్రభుత్వం ఇప్పటి వరకూ అమలు చేయలేదు. 'అన్నదాతా సుఖీభవ' పేరిట పంట సాగుకు పెట్టుబడి సాయం చేస్తామంటూ రైతులను ఊరించి.. చివరకు ఉసూరుమనిపించారు. దీంతో సాగు పెట్టుబడులకు రైతులకు అప్పులు చేయక తప్పని దుస్థితి ఏర్పడింది. దీనికి తోడు అధిక వర్షాలు, వరదలతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం పూర్తి స్థాయిలో ఆదుకోలేదు. ఉచిత పంటల బీమా, పంట నష్ట పరిహారానికి మంగళం పాడారు. రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేశారు. ధాన్యం కొనుగోళ్లలో దళారులు చొరబడి, దగా చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు లేవు. వెరసి పండించిన పంటలకు గిట్టుబాటు ధర దక్కక.. దక్కిన ధరకే తెగనమ్ముకోవాల్సిన దుస్థితి తలెత్తిందని రైతులు వాపోతున్నారు.

నాడు దళారులకు చెక్



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రైతుల వద్దనే నేరుగా ధాన్యం కొనుగోలు చేస్తున్న అధికారులు

ధాన్యం అమ్మకాల్లో దళారుల జోక్యానికి ఆస్కారం లేకుండా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంది. రైతులకు పూర్తి మద్దతు ధర దక్కేలా రైతు భరోసా కేంద్రాలు (ఆర్‌బీకే), సొసైటీల ద్వారా ధాన్యం కొనుగోలు చేసింది. ధాన్యం ఏ రైస్‌మిల్లుకు వెళ్లాలనేది కంప్యూటర్ ద్వారానే నిర్ణయించేలా సాఫ్ట్‌వేర్ రూపొందించింది. ఆర్‌బీకే/సొసైటీకి రైతు ధాన్యం శాంపిల్ తీసుకువెళితే చాలు.. మిగిలిన కొనుగోలు ప్రక్రియ అంతా వ్యవసాయ శాఖ సిబ్బంది చూసుకునేవారు. పూర్తి స్థాయిలో గోనె సంచులు అందుబాటులో ఉంచేది. ప్రతికూల వాతావరణ పరిస్థితులు నెలకొంటే రైతులకు అండగా ఉండి మరీ మద్దతు ధర అందించేది.

రైతులకు వెన్నుదన్నుగా తరలిరండి



కూటమి ప్రభుత్వం రైతులను అన్ని విధాలా దగా చేసింది. అన్నదాత సుఖీభవ సాయం ఎప్పుడిస్తారో చెప్పడం లేదు. వర్షాలు, వరదలతో పంట నష్టపోయిన రైతులకు పూర్తి స్థాయిలో పరిహారం అందలేదు. దళారీ వ్యవస్థకు తిరిగి గేట్లు తెరవడంతో ఖరీఫ్ రైతులకు మద్దతు ధర అందడం లేదు. ఎన్నికల హామీలను అమలు చేసి, రైతు సమస్యలు పరిష్కరించే దిశగా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో శుక్రవారం కాకినాడ కలెక్టరేట్ వద్ద జరిగే ఆందోళనకు జిల్లా నలుమూలల నుంచీ అధిక సంఖ్యలో రైతులు, పార్టీ శ్రేణులు తరలి రావాలి. ఉదయం 10 గంటలకు జిల్లా పరిషత్ సెంటర్‌కు చేరుకుని, అక్కడి నుంచి పాదయాత్రగా కలెక్టరేట్‌కు చేరుకుని, కలెక్టర్‌కు విజ్ఞాపన అందజేస్తాం.

– కురసాల కన్నబాబు, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, కాకినాడ

పైసా విదల్చని కూటమి ప్రభుత్వం

ఖరీఫ్ సీజన్ దాదాపు పూర్తి కావచ్చింది. ఈ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా రైతులు 2.14 లక్షల ఎకరాల్లో సాగు చేయగా ఆది నుంచీ అధిక వర్షాలు, వరదల రూపంలో ప్రకృతి విపత్తులు రైతులను వెంటాడాయి. భారీ వర్షాలు, వరదలకు జిల్లా వ్యాప్తంగా 70 వేల ఎకరాల్లో నాట్లు, 24 వేల ఎకరాల్లో నారుమడులు దెబ్బ తిన్నాయి. రెండోసారి నాట్లు వేసుకోవాల్సి రావడంతో పెట్టుబడులు రెట్టింపై రైతులు అప్పుల పాలయ్యారు. పీఎం కిసాన్ యోజన కింద కేంద్ర ప్రభుత్వం రెండు విడతల్లో రూ.4 వేల సాయం అందించింది. ఏడాదికి రూ.20 వేలు ఇస్తామన్న కూటమి ప్రభుత్వం రైతు భరోసా పథకం పేరును 'అన్నదాతా సుఖీభవ'గా మార్చడం మినహా ఒక్క రూపాయి కూడా విదల్చలేదు. రైతులు రబీలో అడుగు పెడుతున్నా చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఆ ఊసే ఎత్తడం లేదు.

నాడు ఆదుకున్నారిలా..



నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో సాగు ప్రారంభానికి ముందే వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా రైతులకు పెట్టుబడి సాయం అందించేవారు. కేంద్రం ఇచ్చే పీఎం కిసాన్ సాయం రూ.6 వేలకు, రాష్ట్ర ప్రభుత్వం రూ.7,500 జత చేసి ఏటా రూ.13,500 ఖరీఫ్ ప్రారంభం, కోతలు, రబీ ప్రారంభంలో రైతుల ఖాతాల్లో జమ చేసేవారు. తొలి విడతగా మే నెలలో రూ.7,500, ఖరీఫ్ చివరిలో రూ.4 వేలు, రబీ ప్రారంభంలో రూ.2 వేలు అందజేసి ఆదుకున్నారు. ఐదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో రైతుభరోసా కింద జిల్లాలోని 1.70 లక్షల మంది రైతులకు రూ.1,121 కోట్ల సాయం అందించి వెన్నుదన్నుగా నిలిచారు.

ఉచిత పంటల బీమా



రైతుపై ప్రీమియం భారం పడకుండా 2019 ఖరీఫ్ నుంచి జగన్ ప్రభుత్వం ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేసింది. ఈ-క్రాప్ నమోదు ప్రామాణికంగా రైతులు చెల్లించాల్సిన ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లిస్తూ వచ్చింది. సాగు చేసిన ప్రతి ఎకరాకూ బీమా వర్తించడంతో పంట నష్టం వాటిల్లినప్పుడు రైతులతో పాటు గుర్తింపు కార్డులు పొందిన కౌలు రైతులు కూడా పరిహారం అందుకోగలిగారు. ఐదేళ్ల పాలనలో ఏటా రూ.1.4 లక్షల చొప్పున జిల్లాలోని 7 లక్షల మంది రైతుల తరఫున బీమా కంపెనీలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.140 కోట్ల ప్రీమియం చెల్లించి, రైతులపై నయా పైసా భారం పడకుండా చూసింది. పంట నష్టపోయిన 1,14,011 మంది రైతులకు రూ.217.64 కోట్ల పరిహారం ఇచ్చి అండగా నిలిచింది.

నేడు భారమంతా రైతుల పైనే..

జగన్ ప్రభుత్వం అమలు చేసిన ఉచిత పంటల బీమా పథకానికి నేటి కూటమి ప్రభుత్వం మంగళం పాడేసింది. ఫలితంగా ఈ రబీ నుంచి రైతులే ప్రీమియం చెల్లించాలి. ఎకరాకు పంట విలువ రూ.41 వేలలో ప్రీమియంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 0.5 శాతం అంటే రూ.205 చెల్లిస్తే, మిగిలిన 1.5 శాతం మేర రూ.615 రైతులే ప్రీమియంగా చెల్లించాలి. జిల్లాలోని 2.3 లక్షల ఎకరాల్లో రబీ సాగు జరుగుతుందనే అంచనా ఉండగా.. పంటల బీమా ప్రీమియం రూపంలో రైతుల నెత్తిన కూటమి ప్రభుత్వం రూ.14.15 కోట్ల భారం మోపింది.

నేడు గేట్లు బార్లా..

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత దళారీ వ్యవస్థకు తిరిగి గేట్లు బార్లా తెరిచారు. ధాన్యం కొనుగోళ్లలో ఇప్పుడు దళారులే తెర వెనుక ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. తేమ శాతం ఎక్కువనో, తాలు, తప్ప గింజలున్నాయనో చెప్పి, మద్దతు ధరకు కోత పెడుతున్నారు. ఇటీవల ఫెంగల్ తుపాను సమయంలో వారు చెప్పిందే రేటు. కామన్ వెరైటీ 75 కేజీల బస్తాకు రూ.1,725 మద్దతు ధర కాగా.. తేమ శాతం సాకుగా చూపించి బస్తాకు రూ.200 నుంచి రూ.300 వరకూ కోత పెట్టారు. వాతావరణం ఎప్పుడెలా ఉంటుందోననే ఆందోళనతో రైతులు కళ్లాల్లోని ధాన్యాన్ని అయినకాడికి అమ్ముకోవడంతో ఎకరాకు రూ.6 వేల నుంచి రూ.9 వేల వరకూ నష్టపోయారు. రవాణా, హమాలీ ఖర్చుల రూపంలోనూ బస్తాకు రూ.30 నుంచి రూ.40 వరకూ నష్టపోయారు.

'అన్నదాతా సుఖీభవ' ఎప్పుడిస్తారో చెప్పండి



జిల్లాలో 80 శాతం మందికి వ్యవసాయమే జీవనాధారం. ఇటువంటి జిల్లాలో కూటమి నేతలు ఎన్నికల ముందు అనేక హామీలు గుప్పించారు. వాటిని అమలు చేయడం లేదు. గత ప్రభుత్వం అమలు చేసిన ఉచిత పంటల బీమాను ఎత్తివేయడం అన్యాయం. రైతులకు భారం కాకుండా ఉచిత పంటల బీమాను కొనసాగించాలి. 'అన్నదాతా సుఖీభవ' కింద సీజన్ ప్రారంభంలో ఇవ్వాల్సిన రూ.20 వేలు ఇంతవరకూ ఇవ్వకపోవడం అన్యాయం. కనీసం ఎప్పుడిస్తారో కూడా ప్రభుత్వం స్పష్టత ఇవ్వకుండా రైతులను మోసం చేస్తోంది.

– కర్నాకుల వీరాంజనేయులు, ప్రధాన కార్యదర్శి, ఏపీ రైతు కూలీ సంఘం

తక్కువ రేటుకే కొన్నారు



తుపాను, వరదలతో ధాన్యాన్ని కళ్లాల్లోనే అమ్మేసుకున్నాం. ప్రభుత్వం చెప్పినట్టు కనీస మద్దతు ధర రూ.1,750 వస్తుందనుకున్నాం. తీరా చూస్తే 75 కేజీల బస్తా రూ.1,400 నుంచి రూ.1,500కే అమ్ముకోవాల్సి వచ్చింది. కనీస మద్దతు ధర గురించి అడిగితే తేమ శాతం ఎక్కువగా ఉందని సాకులు చూపించారు. పెట్టుబడి సాయం అందుతుందనుకున్నాను. ఖరీఫ్ సీజన్ ముగిసినా అందలేదు. ఆ సాయం అంది ఉంటే పెట్టుబడి కోసం అప్పులు చేయాల్సిన అవసరం లేకుండా ఉండేది. కనీసం రబీ నాటికైనా అన్నదాతా సుఖీభవలో రూ.20 వేలు అందజేసి ఆదుకోవాలి.

– నల్లల గోవిందు, రైతు, కట్టమూరు, పెద్దాపురం

పెట్టుబడి సాయం ఇవ్వరా!



ఖరీఫ్ దాదాపు ముగిసిపోయింది. రబీ సాగుకు అంతా సిద్ధమవుతున్నాం. ఖరీఫ్ ప్రారంభంలోనే పెట్టుబడి సాయం వస్తుందని ఎంతో ఆశగా ఎదురు చూశాం. అన్నదాతా సుఖీభవ అంటూ ప్రకటించిన పథకంతో రూ.20 వేలు వస్తాయనుకున్నాం. ఇంత వరకూ అది రాలేదు. పెట్టుబడి సాయం అందితే కొంతలో కొంత సాగుకు ఉపయోగపడేది.

– పెనుమల్లి పాపిరెడ్డి, రైతు, రమణక్కపేట, యు.కొత్తపల్లి

నేడు వైఎస్సార్ సీపీ ఆందోళన

కూటమి ప్రభుత్వ హయాంలో దగా పడిన రైతన్నకు దన్నుగా నిలవాలన్న మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఆ పార్టీ శ్రేణులు తొలి దశ ఆందోళనకు సిద్ధమవుతున్నాయి. రైతులకు న్యాయం జరిగే దిశగా ప్రభుత్వాన్ని మేల్కొలిపే సంకల్పంతో రైతుల పక్షాన పోరాటానికి సమాయత్తమవుతున్నాయి. ఇందులో భాగంగా వైఎస్సార్ సీపీ నేతలు జిల్లా కలెక్టర్‌కు శుక్రవారం విజ్ఞాపన అందించనున్నారు. అన్నదాతలకు మేలు చేసే ఈ కార్యక్రమంలో పాలు పంచుకునేందుకు ఆ పార్టీ నాయకులు, రైతు సంఘాల ప్రతినిధులు, రైతులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో కాకినాడ తరలేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. తద్వారా రైతు సమస్యలు పరిష్కారమయ్యేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురానున్నారు.

మెట్లోత్సవంపై గందరగోళం

- 16న జరపాలన్న అన్నవరం దేవస్థానం పంచాంగం
- 15నే నిర్వహించేందుకు అధికారుల ఏర్పాట్లు

అన్నవరం : ఏటా ధనుర్మాస ఉత్సవాల ప్రారంభానికి ముందు రోజు సత్యదేవుని మెట్లోత్సవం నిర్వహిస్తుంటారు. అయితే, ఈసారి ఈ ఉత్సవం నిర్వహణపై కొంత గందరగోళం నెలకొంది. అన్నవరం దేవస్థానం పంచాంగంలో ఈ నెల 16వ తేదీ సోమవారం మెట్లోత్సవం, ధనుర్మాస ఉత్సవాల ప్రారంభం అని ఉంది. అయితే మెట్లోత్సవాన్ని ఈ నెల 15వ తేదీ ఆదివారమే నిర్వహించనున్నట్లు అన్నవరం దేవస్థానం అధికారులు తెలిపారు. దీంతో ఏ తేదీ సరైనదనే అంశంపై దేవస్థానంలో చర్చ జరుగుతోంది. దేవస్థానం పంచాంగాన్ని తంగిరాల ప్రభాకర పూర్ణయ్య సిద్ధాంతి రూపొందించారు. ఆయనకు తంగిరాల వేంకట కృష్ణ పూర్ణ ప్రసాద్ సహకరించారని ఆ పంచాంగంలో పేర్కొన్నారు. వాస్తవానికి ఈ పంచాంగం రాతప్రతిని ప్రతి ఉగాదికి మూడు నెలల ముందుగానే పంచాంగకర్తలు దేవస్థానం పండితులకు అందజేస్తారు. దానిని దేవస్థానం వైదిక కమిటీ పరిష్కరించి, తప్పులను సవరించి తిరిగి పంచాంగకర్తలకు పంపిస్తారు. అనంతరం దానిని ముద్రించి, ఉగాది నాడు దేవస్థానంలో పూజలు చేసి, పంపిణీ చేస్తారు. అయితే పంచాంగకర్తల గణన లోపమో లేక దేవస్థానం పండితులు సరిగా పరిశీలించకపోవడమో కానీ మెట్లోత్సవానికి పంచాంగంలో పేర్కొన్నది ఒక తేదీ అయితే దేవస్థానం నిర్వహిస్తున్నది మరో తేదీగా ఉంది.

చురుకుగా ఏర్పాట్లు
మెట్లోత్సవం సందర్భంగా రత్నగిరి దిగువన తొలి పావంచా నుంచి కొండ మీద సత్యదేవుని ఆలయం వరకూ ఉన్న 450 మెట్లకు భక్తులతో పూజలు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను ఇప్పటికే ప్రారంభించారు. రత్నగిరి మెట్ల మార్గంలో ప్రతి మెట్టునూ రంగులు వేసి, ముస్తాబు చేశారు. తొలి పావంచా వద్ద ఉన్న సత్యదేవుని పాదాల మండపం వద్ద ప్రత్యేకంగా అలంకరించనున్నారు. ఆదివారం ఉదయం 8.30 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. తొలుత రత్నగిరి నుంచి కొండ దిగువకు సత్యదేవుడు, అమ్మవార్లను ఊరేగింపుగా తీసుకు వచ్చి, గ్రామంలో పల్లకీలో ఊరేగిస్తారు. అనంతరం తొలి పావంచా వద్ద స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేస్తారు. తరువాత తొలి పావంచా వద్ద పూజలు చేసి, మెట్లోత్సవాన్ని ప్రారంభిస్తారు. అక్కడి నుంచి స్వామివారి ఆలయం వరకూ ఉన్న మెట్లకు భక్తులు పూజలు చేసి, హారతి ఇస్తారు. ఆ మెట్ల మీద నుంచి స్వామి, అమ్మవార్లను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువెళ్తారు. ఇదిలా ఉండగా ధనుర్మాసం ప్రారంభమవుతున్న నేపథ్యంలో సోమవారం నుంచి సంక్రాంతి వరకూ అంటే జనవరి 14వ తేదీ వరకూ సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీ అమ్మవారిని ప్రతి రోజూ ఉదయం ఏడు గంటల నుంచి అన్నవరం వీధుల్లో పల్లకీ మీద ఘనంగా ఊరేగిస్తారు.



ముస్తాబవుతున్న మెట్లు

అచ్చు తప్పే..

ధనుర్మాసం 16వ తేదీన ప్రారంభమవుతోంది. దానికి ఒక రోజు ముందు అంటే 15వ తేదీన మెట్లోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అయితే, పంచాంగంలో రెండూ ఒకే రోజు నిర్వహిస్తున్నట్లుగా అచ్చు తప్పు పడింది.

– గొల్లపల్లి గణపతి ఘనపాఠి, దేవస్థానం వేద పండితుడు

ఎన్నాళ్లకెన్నాళ్లకు..!

- అన్నవరం దేవస్థానం కొత్త ఈఓగా సుబ్బారావు
- ఎట్టకేలకు దేవదాయ శాఖ కమిషనర్ ఆదేశాలు
- గత నెల 29నే ఉత్తర్వులు
- అమలుకు రెండు వారాలు



అన్నవరం దేవస్థానం


అన్నవరం: శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానానికి రెగ్యులర్ ఈఓగా డిప్యూటీ కలెక్టర్ వి.సుబ్బారావును నియమిస్తూ దేవదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్, ఆ శాఖ ఇన్‌చార్జి కార్యదర్శి ఎస్.సత్యనారాయణ ఎట్టకేలకు గురువారం ఆదేశాలు జారీ చేశారు. వాస్తవానికి గత నెల 29న రాష్ట్రవ్యాప్తంగా 68 మంది డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. దీని ప్రకారం ఎయిర్‌పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో భూసేకరణ డైరెక్టర్‌గా పని చేస్తున్న వి.సుబ్బారావును ఏడాది పాటు డెప్యూటేషన్‌పై అన్నవరం దేవస్థానం ఈఓగా నియమించారు. ఇది జరిగిన రెండు వారాల అనంతరం ఆయనకు పోస్టింగ్ ఇస్తూ ఆదేశాలు ఇచ్చారు.

జాప్యంపై ఊహాగానాలు
దేవస్థానానికి పూర్తి స్థాయి ఈఓ నియామక ఉత్తర్వుల విడుదలలో జాప్యంపై అనేక ఊహాగానాలు వినిపించాయి. గత నెల 29న చేసిన బదిలీల్లో భాగంగా శ్రీశైలం, కాణిపాకం, అన్నవరం దేవస్థానాలకు డిప్యూటీ కలెక్టర్లను ఈఓలుగా నియమించారు. మిగిలిన రెండు దేవస్థానాల్లో ఈ నెల 4న నూతన ఈఓలు బాధ్యతలు స్వీకరించారు. అన్నవరం ఈఓగా నియమితులైన సుబ్బారావు అదే రోజు దేవదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో రిపోర్టు చేశారు. ఆ రోజే ఆయనకు కూడా పోస్టింగ్ ఇవ్వాలి. కానీ, పోస్టింగ్ ఇవ్వడానికి ఎనిమిది రోజులు పట్టింది. ఆయన నియామకాన్ని నిలుపు చేయడానికి కొంత మంది తీవ్ర ప్రయత్నాలు చేశారని, అందువల్లనే జాప్యం జరుగుతోందనే ప్రచారం జరిగింది. సుబ్బారావు ముక్కుసూటిగా వ్యవహరించే అధికారి అని, నిజాయితీపరునిగా రెవెన్యూ శాఖలో పేరున్నందున, ఆయన స్థానంలో మరొకరిని నియమించేందుకు విఫలయత్నం చేశారని అంటున్నారు.

దేవస్థానం పేరు తప్పుగా..
సుబ్బారావును ఈఓగా నియమిస్తూ ఇచ్చిన ఆదేశాల్లో 'స్వయంభూ శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానం, అన్నవరం' అని తప్పుగా పేర్కొన్నారు. తరువాత ఈ తప్పును సవరించి 'శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం, అన్నవరం'గా మార్చారు.

రెగ్యులర్ ఈఓ లేక..
రెండు వారాలుగా రెగ్యులర్ ఈఓ లేక అన్నవరం దేవస్థానం పరిపాలనా వ్యవహారాల్లో స్తబ్దత నెలకొంది. ఇన్‌చార్జి ఈఓగా ఏడాది కాలంగా పని చేసిన దేవదాయ, ధర్మాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ కె.రామచంద్ర మోహన్‌ను గత నెల 25న ఈఓ బాధ్యతల నుంచి రిలీవ్ చేశారు. అనంతరం ఇన్‌చార్జిగా సింహాచలం దేవస్థానం ఈఓ వి.త్రినాథరావును నియమించారు. ఆయన హుండీల లెక్కింపు, వీవీఐపీల రాక, అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే ఇక్కడకు వచ్చారు. సింహాచలంలో కూడా కీలక విధులు నిర్వహిస్తుండటంతో ఆయన రెగ్యులర్‌గా వచ్చే అవకాశం లేకుండా పోయింది. దీంతో ఇన్నాళ్లుగా పరిపాలనా వ్యవహారాలు స్తబ్దుగా సాగుతున్నాయి.

రేపు నూతన ఈఓ బాధ్యతల స్వీకరణ



వి.సుబ్బారావు

ప్రస్తుతం ఇన్‌చార్జిగా ఉన్న సింహాచలం దేవస్థానం ఈఓ వి.త్రినాథరావు నుంచి నూతన ఈఓ సుబ్బారావు శనివారం సాయంత్రం 4 గంటలకు రత్నగిరిపై బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆ మేరకు దేవస్థానం పండితులు ముహూర్తం నిర్ణయించినట్లు సమాచారం.

క్లుప్తంగా

హాస్టల్‌లో మందుబాబుల దోపిడీ



నిందితులను చూపి వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాస్, ఎస్సై మణికుమార్

పిఠాపురం: స్థానిక సోషల్ వెల్ఫేర్ బాయ్స్ హాస్టల్‌లో 9వ తేదీ అర్ధరాత్రి విద్యార్థులను బెదిరించి దోపిడీకి పాల్పడిన ఇద్దరిని గురువారం అరెస్ట్ చేసినట్లు పిఠాపురం పట్టణ సీఐ శ్రీనివాస్, ఎస్సై మణికుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. స్థానిక రథాలపేటకు చెందిన పూడి గంగాధర్ (బాలు), అతని స్నేహితుడు, కుమారపురం గ్రామానికి చెందిన గుబ్బల దయానంద (పాలు) మద్యం తాగి డబ్బుల కోసం పిఠాపురంలోని సోషల్ వెల్ఫేర్ బాయ్స్ హాస్టల్‌లోకి గోడ దూకి లోపలకు ప్రవేశించారు. హాస్టల్‌లో నిద్రిస్తున్న 8, 9, 10 తరగతి విద్యార్థులు ఉండే గదుల్లోకి వెళ్లి వారిని భయభ్రాంతులకు గురిచేశారు. బీరు బాటిళ్లు పగలగొట్టి దానితో పొడిచి చంపుతానని బెదిరించారు. పిల్లల వద్ద ఉన్న డబ్బులు పూర్తిగా ఇవ్వాలని, లేకపోతే చంపుతామంటూ బెదిరించి సుమారు రూ.540 బలవంతంగా వసూలు చేసి పరారయ్యారు. ఈ సంఘటనపై హాస్టల్ వార్డెన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పిఠాపురం టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. గురువారం నిందితులను అరెస్టు చేసి పిఠాపురం కోర్టులో హాజరు పరిచామని సీఐ వివరించారు.

ఎన్నికల్లో ఎన్ని వింతలో..

- నీటి సంఘాల ఎన్నికల్లో ఇష్టారాజ్యం
- ఉప ముఖ్యమంత్రి ఇలాకాలో అస్తవ్యస్తంగా విభజన
- పిఠాపురం ఏలేరు ఆయకట్టులో 400 మంది ఓట్లు గల్లంతు
- ఏలేరుతో సంబంధం లేనివారికి ప్రాధాన్యం
- ఆధిపత్యానికి చక్రం తిప్పుతున్న టీడీపీ నేత



ఏలేరు కాలువ

పిఠాపురం: సాగునీటి సంఘాలకు రెండు అంచెల్లో ఎన్నికలు నిర్వహించడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ నెల 14న సాగునీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులను, 17న డిస్ట్రిబ్యూషన్ కమిటీలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. అయితే నీటి సంఘాల ఎన్నికల్లో కొందరి ఇష్టారాజ్యం సాగుతోంది.. ఈ ఎన్నికల్లో అర్హులకు ఎగనామం పెట్టి తమకు అనుకూలమైన రైతులకు పదవులు కట్టబెట్టేందుకు ప్రయత్నం జరుగుతోంది. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇలాకాలో జరుగుతున్న ఈ తంతుపై రైతాంగం మండిపడుతోంది. ఏలేరు పరివాహక ప్రాంతాల్లో అత్యంత కీలకమైన పిఠాపురం నియోజకవర్గంలో నీటి సంఘాల విభజన, విలీనాలపై అభ్యంతరాలు వ్యక్తమైనా జరిగేది జరిగిపోతోంది. శాస్త్రీయత లేని విభజనతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు చెబుతున్నా.. రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించినా జిల్లా అధికారులు పట్టించుకోక పోవడంతో వందల మంది రైతులు తమ ఓటుతో పాటు సాగు నీటి సరఫరాపై హక్కులను కోల్పోతున్నారు. నియోజకవర్గంలో కొన్ని గ్రామాలను సంఘాల్లో చేర్చకపోవడం, సంబంధం లేని డీసీల్లో విలీనం చేయడం పిఠాపురం నియోజకవర్గ ఏలేరు రైతాంగానికి తీరని నష్టంగా మారింది. నీటి సంఘాల ఎన్నికల నేపథ్యంలో నీటి పారుదల శాఖ చేపట్టిన ప్రాదేశిక నియోజక వర్గాల విభజన రైతులను నట్టేట ముంచేలా ఉందనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది.

అటు ఇటు మార్పులు..

ఏలేరు ఆయకట్టుపై జగ్గంపేట, ఏలేశ్వరం, పిఠాపురం, గొల్లప్రోలు, ప్రత్తిపాడు, కిర్లంపూడి, పెద్దాపురం మండలాల్లో వ్యవసాయం జరుగుతోంది. ఏలేరు ప్రాజెక్టుపై 2003 నుంచి ఇప్పటి వరకూ ఐదు డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఎన్నికలు జరిగేవి. తాజాగా ఏలేరు ఆధునీకరణకు భారీగా నిధులు విడుదల చేసే అవకాశం ఉండడంతో వాటిపై పెత్తనం చెలాయించడానికి మెట్ట ప్రాంత టీడీపీ నేత ప్రోద్బలంతో డీసీల సంఖ్యను ఆరుకు పెంచడంతో పాటు నీటి సంఘాలు 30కి పెంచడం, ఇష్టారాజ్యంగా మార్పులు చేశారు. దీనిపట్ల ఏలేరు ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పిఠాపురం మండలం రాపర్తి, భోగాపురం, బి.ప్రత్తిపాడు నీటి సంఘాలు ముక్కొల్లు డీసీలో ఉండేవి. అధికారులు ఈ గ్రామాలను డీసీ నుంచి తొలగించారే తప్ప మరో డీసీలో కలపలేదు. దీనివల్ల ఈ గ్రామాల్లో సుమారు 400 మంది రైతులు తమ ఓటు హక్కును కోల్పోగా, వేలాది మంది నీటి పారుదలపై తమకు ఉన్న హక్కులను కోల్పోయారు. భవిష్యత్తులో నీటి సమస్యలు, కాలువ ఆధునీకరణకు సంబంధించి ఎవరిని అడగాలో తెలియని అయోమయ పరిస్థితిలోకి వెళ్లిపోయామని రైతులు వాపోతున్నారు. తమను ఓటరు జాబితాలో చేర్చలేదని ఆందోళన వ్యక్తం చేసినా అధికారులు పట్టించుకోలేదని అంటున్నారు. పిఠాపురం మండలం ఏలేరు ఆయకట్టుపై పి.దొంతమూరు, పి.రాయవరం కమిటీలు కిర్లంపూడి డీసీలో ఉండేవి. వాటిని ఆ డీసీ నుంచి తొలగించి ఎక్కడో దూరంగా ఉన్న ముక్కొల్లు, కిర్లంపూడి డీసీలో కలిపారు. పెద్దాపురం డీసీలో ఉండే మల్లాం, మంగితుర్తి గ్రామాలను అక్కడ తొలగించి గొల్లప్రోలులో కలపడంపై మల్లాం, జల్లూరు ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక కాలువపై సాగు చేసే గ్రామాల రైతులను ఒక కాలువపై కాకుండా వివిధ కాలువలకు గ్రామాలకు విభజించడం ఏంటని ప్రశ్నించినా ఎవరూ పట్టించుకోడం లేదని వాపోతున్నారు.

హైకోర్టు ఆదేశించినా..



నీటి సంఘాల అస్తవ్యస్త విభజనపై పిఠాపురం ఏలేరు ఆయకట్టు రైతులు రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. దీనిని విచారించిన హైకోర్టు నీటి సంఘాల విభజనపై పూర్తి స్థాయి నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. అయినప్పటికీ ఏఒక్క అధికారి పట్టించుకోలేదు. తమకు ఓట్లు లేకుండా పోతున్నాయని మొరపెట్టుకోగా అధికారులు వచ్చి విచారణ చేసి వెళ్లి పోయారే తప్ప ఏ ఒక్కరికి ఓటు హక్కు కల్పించలేదు. ఒకపక్క రైతులు ఆందోళన చేస్తున్నా ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధం చేస్తున్నారు. రైతులకు అన్యాయం చేస్తూ నీటి సంఘాల ఎన్నికలు జరుగుతుండడంపై ఈ నియోజకవర్గ ఎమ్మెల్యే, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ దృష్టి సారించాలి.

– ఎం.శ్రీనివాసరెడ్డి, రైతు, రాపర్తి, పిఠాపురం మండలం

మా హక్కులు కాలరాశారు



పూర్వం నుంచి భూములు పండించుకుంటూ సాగునీటి హక్కును కలిగి ఉన్న మా గ్రామ రైతుల హక్కులను అధికారులు కాలరాశారు. వందల మంది రైతుల ఓటు హక్కును తీసేశారు. ప్రతి నిత్యం కాలువలపై తిరిగే మాకు హక్కు లేకుండా ఎక్కడో ఉన్న ముక్కొల్లు కాలువపై కమిటీలో కలిపారు. ఇలాంటి విభజన ఎప్పుడూ లేదు. ఎంత మొరపెట్టుకుంటున్నా అధికారులు పట్టించుకోడం లేదు. ఎవరికి చెప్పినా వినే నాథుడు లేడు. ఎవరి కోసం ఇదంతా చేస్తున్నారో అర్థం కావడం లేదు. ఈ సాగునీటి సంఘాల ఎన్నికలు అంతా రైతులకు అన్యాయం చేయడానికే చేస్తున్నట్టు కనిపిస్తోంది.

– వీరపురెడ్డి వెంకటరమణ, రైతు, రాపర్తి, పిఠాపురం మండలం

నన్నయ వర్సిటీ ఆర్చరీ జట్ల ఎంపిక



ఆర్చరీ పోటీలను ప్రారంభిస్తున్న ఆచార్య సుధాకర్

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఇంటర్ కాలేజియేట్ ఆర్చరీ (విలువిద్య) మెన్ అండ్ ఉమెన్ యూనివర్సిటీ టీమ్ సెలక్షన్స్ గురువారం ప్రారంభమయ్యాయి. దీనికోసం నిర్వహించిన పోటీలను రిజిస్ట్రార్, స్పోర్ట్స్ బోర్డు ఇన్‌చార్జి సెక్రటరీ ఆచార్య జి.సుధాకర్ ప్రారంభించారు. ఏకలవ్యుని మాదిరిగా ఏకాగ్రతతో లక్ష్యాలను సాధించాలని ఆయన అన్నారు. ఇండియన్ రౌండ్ ఆర్చరీ విధానంలో జరిగిన పోటీలకు అనుబంధ కళాశాలల నుంచి 40 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అభ్యర్థులను యూనివర్సిటీ జట్లకు ఎంపిక చేశారు. పురుషుల విభాగంలో టి.అజయ్ (ఎస్‌కేవీటీ రాజమహేంద్రవరం), పి.కృష్ణ (సీబీఆర్, పిఠాపురం), యు.మహేష్‌బాబు, వి.వెంకటప్రసాద్ (జీడీసీ చింతలపూడి)లు ఉన్నారు. అలాగే మహిళా విభాగం నుంచి డి.మానస, జి. నవ్యమమత (ఏఎస్‌డీ కాలేజీ, కాకినాడ), జి.సావిత్రి, సీహెచ్ అంజలి (జీడీసీ చింతలపూడి) ఉన్నారు. వీరు ఈ నెల 22 నుంచి 26 వరకూ భువనేశ్వర్‌లోని కిట్ యూనివర్సిటీలో జరిగే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొంటారని ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ కె.సుబ్బారావు తెలిపారు. కార్యక్రమంలో సెక్రటరీలు వి.సాల్మన్, దేవానంద్, అబ్జర్వర్ డాక్టర్ సీవీ సుబ్రహ్మణ్యం, సెలక్షన్ కమిటీ సభ్యులు అలీ, విజయ్‌కుమార్, పీఈటీలు ఆర్.సాంబశివరావు, డాక్టర్ బి.రామ్‌గోపాల్, డాక్టర్ బాల సత్యనారాయణ, రిటైర్డ్ ఎంఈఓ జేఎన్ఎస్ గోపాలకృష్ణ, టి.లక్ష్మణ్, డాక్టర్ సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో వ్యక్తికి జీవిత ఖైదు

రాజానగరం: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధి కొంతమూరులో జరిగిన హత్య కేసులో ఓ వ్యక్తికి జీవిత ఖైదుతోపాటు రూ. రెండు వేల జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరం 5వ అదనపు సెషన్స్ జడ్జి డి.విజయ్‌గౌతమ్ గురువారం తీర్పు చెప్పారు. కొంతమూరుకు చెందిన తోట కనకదుర్గను 2020లో అయినశెట్టి నరసింహరాజు హతమార్చాడు. అతనిపై అప్పటి ఎస్సై ఐ.నాగబాబు కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ ఎంవీ సుభాష్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టి, ముద్దాయిని అరెస్టు చేశారు. నేరం రుజువు కావడంతో జడ్జి పైవిధంగా తీర్పునిచ్చారని సీఐ వీరయ్యగౌడ్ తెలిపారు.

పురుగు మందు తాగి వ్యక్తి మృతి

- సకాలంలో వైద్యం అందలేదని బంధువుల ఆరోపణ
- గోకవరం ప్రభుత్వాసుపత్రి ఎదుట ఆందోళన



డ్యూటీ డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఆందోళన చేస్తున్న మృతుని బంధువులు



రాజమల్లి మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

గోకవరం: పురుగు మందు తాగిన వ్యక్తికి సకాలంలో వైద్యం అందక మృతి చెందాడంటూ గోకవరం ప్రభుత్వాసుపత్రి ఎదుట బంధువులు ఆందోళన చేపట్టారు. ఆ వివరాల ప్రకారం.. గోకవరానికి చెందిన కాళ్ల రాజమల్లి (35) తాపీపని చేస్తూ జీవినం సాగిస్తున్నాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో గురువారం తెల్లవారు జామున పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు అతన్ని హుటాహుటిన గోకవరం ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లారు. పరిస్థితి విషమంగా మారడంతో స్థానికంగా ఉన్న ప్రైవేట్ ఆస్పత్రికి, అక్కడి నుంచి 108 అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. దీంతో ఆగ్రహానికి గురైన బంధువులు అతని మృతదేహంతో గోకవరం ప్రభుత్వాసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. పురుగు మందు తాగిన రాజమల్లిని హుటాహుటిన గోకవరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువస్తే డ్యూటీ డాక్టర్ గంట వరకూ పట్టించుకోలేదని ఆరోపించారు. తామే ఉప్పు నీళ్లు పట్టించామని, కనీసం చెయ్యి పట్టుకుని కూడా చూడలేదని వాపోయారు. గంట సేపు వైద్యం అందించకపోవడంతో మృత్యువాత పడ్డాడని, వైద్యం అందించి ఉంటే బతికేవాడన్నారు. ఈ విషయం తెలుసుకున్న గోకవరం ఎస్సై పవన్‌కుమార్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పాలూరి బోసుబాబు అక్కడకు చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. డ్యూటీ డాక్టర్‌పై చర్యలు తీసుకునే వరకూ ఆందోళన విరమించేది లేదని, అవసరమైతే జిల్లా కలెక్టర్ వద్దకు వెళతామని హెచ్చరించారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఫోన్‌లో మృతుని కుటుంబ సభ్యులతో మాట్లాడగా తమకు న్యాయం చెయ్యాలని కోరారు. అనంతరం కోరుకొండ సీఐ సత్యకిశోర్ సమక్షంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వనజాకుమారి మృతుని బంధువులతో మాట్లాడుతూ ఘటనపై విచారణ నిర్వహించి బాధ్యులపై రెండు రోజుల్లో చర్యలు తీసుకుంటామని తెలపడంతో ఆందోళన విరమించారు. ఇదిలా ఉండగా గత నెల 23న గోకవరం ఫారెస్ట్ ఠాణాలో ఠాణాదార్‌గా విధులు నిర్వహిస్తున్న బీరబోయిన వెంకటలక్ష్మి ప్రసవం సమయంలో వైద్యం వికటించి మృత్యువాత పడింది. దీంతో ఆసుపత్రిలో వైద్య సేవలు సక్రమంగా అందడం లేదనే ఆరోపణలు ప్రజల వద్ద నుంచి వినిపిస్తున్నాయి.

ఘటనపై డీసీహెచ్ఎస్ విచారణ

వైద్యం అందక వ్యక్తి మృతి చెందాడన్న ఆరోపణలపై రాజమహేంద్రవరం డీసీహెచ్ఎస్ డాక్టర్ ఎస్.పద్మశ్రీరాణి విచారణ నిర్వహించారు. ఉదయం గోకవరం ప్రభుత్వాసుపత్రిలో విచారణ చేపట్టి ఘటనపై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వనజకుమారితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు సకాలంలో వైద్య సేవలందించాలని సిబ్బందికి సూచించారు.

అణచివేత ఉన్నచోట తిరుగుబాటు ఉండాలి

జాతీయ పురస్కారాల ప్రదానోత్సవంలో 'వెన్నెల గద్దర్'



పి.గన్నవరంలో గద్దర్ జాతీయ పురస్కారాన్ని అందిస్తున్న వెన్నెల గద్దర్, ఎమ్మెల్యే గిడ్డి

పి.గన్నవరం: అణచివేత ఉన్నచోట తిరుగుబాటు ఉండాలని, అప్పుడే న్యాయం జరుగుతుందని ప్రజా గాయకుడు గద్దర్ కుమార్తె, తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల గద్దర్ అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న 110 మందికి మమత స్వచ్ఛంద సేవాసమితి అధ్యక్షుడు కోరుకొండ జాన్ ఆధ్వర్యంలో గురువారం పి.గన్నవరం సాయితేజ విద్యాసంస్థల ప్రాంగణంలో గద్దర్ జాతీయ పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సభలో వెన్నెల గద్దర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు తమ ఆశయాలు, లక్ష్యాలను ముందే నిర్దేశించుకుని ముందుకు సాగాలన్నారు. ఎన్నో ఇబ్బందులు పడి 69 ఏళ్ల పాటు ఇక్కడి మహిళలు, ప్రజలు, పేదలకు విశేష సేవలు అందించిన మదర్‌థెరిసాను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. తన పిల్లలకు సెల్‌ఫోన్ ఇవ్వనని, టీవీ చూపించనని, గద్దర్ పాటలు వినిపిస్తానని వెన్నెల వెల్లడించారు. తన తండ్రి గద్దర్ పేరున సేవా పురస్కారాలు అందించిన కోరుకొండ జాన్‌ను అభినందించారు.

దివ్యాంగురాలిపై అత్యాచార యత్నం

కరప: ఓ దివ్యాంగురాలిపై ఫీల్డ్‌అసిస్టెంట్ లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటన కరప మండలం వేములవాడలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. వేములవాడ గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ మట్టపర్తి వీరబాబు ఈ నెల 11న రాత్రి 9 గంటల సమయంలో తన స్నేహితుడిని సినిమాకెళదాం వస్తావా అడిగాడు. ఇంటి వద్ద తన అక్క ఒక్కర్తే ఉందని, రానని చెప్పి వెళ్లిపోయాడు. ఇదే అదునుగా భావించిన వీరబాబు తన స్నేహితుడి ఇంటికెళ్లాడు. మానసిక స్థిమితం లేని దివ్యాంగురాలు ఒక్కరే అక్కడ ఉంది. తల్లిదండ్రులు పనులు నిమిత్తం బయటకు వెళ్లారు. వీరబాబు ఆ దివ్యాంగురాలిపై అత్యాచారం చేసేందుకు ప్రయత్నిస్తుండగా అదే సమయంలో నిందితుడి స్నేహితుడు, పిన్నితో కలసి ఇంటికి వచ్చేసరికి తలుపులు వేసి ఉండటంతో గట్టిగా కొట్టారు. వీరబాబు తలుపులు తీసి పారిపోయాడు. ఈ విషయం తెలుసుకున్న బాధితురాలి తల్లి గురువారం సాయంత్రం కరప పోలీస్ స్టేషన్‌కు వచ్చి, ఫిర్యాదు చేశారు. కరప ఎస్ఐ టి.సునీత బాధితురాలి నుంచి స్టేట్‌మెంట్ తీసుకుని, చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి పంపించారు.

వైభవంగా శ్రీరామ పాదుకారాధన

- ఆంధ్రా భద్రాద్రికి తులగిరి శ్రీరామక్షేత్రంగా నామకరణ
- త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామి



ప్రత్తిపాడులో ప్రసంగిస్తున్న త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామి



ప్రత్తిపాడు శ్రీరామనామ క్షేత్రంలో సామూహిక శ్రీరామ పాదుకారాధనలో పాల్గొన్న భక్తులు

ప్రత్తిపాడు: ఆంధ్రా భద్రాద్రిగా పిలిచే ప్రత్తిపాడు నరేంద్రగిరిపై శ్రీరామనామ దివ్య క్షేత్రంలో గురువారం శ్రీరామ పాదుకాపట్టాభిషేకం వైభవోపేతంగా జరిగింది. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త శ్రీత్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామి పర్యవేక్షణలో ఈ పూజాగ్రంథం జరిగాయి. ఈ క్షేత్రంలో వందలాది మంది మహిళలతో శ్రీరామపాదుకా పట్టాభిషేక పూజలను ఆయనే స్వయంగా చేయించారు. ఈ సందర్భంగా చిన జీయర్ స్వామి మాట్లాడుతూ ప్రత్తిపాడు ప్రాంతం విశిష్టమైందన్నారు. ఓ వైపు పచ్చని పంట భూములు, మరో వైపు ఎత్తైన గిరులతో ఉన్న ఈ ప్రాంతం ఆధ్యాత్మిక కేంద్రంగా వర్ధిల్లుతుందన్నారు. శ్రీరాముని ఆదర్శాలను అనుసరించడమే ప్రతి ఒక్కరి ధ్యేయం కావాలన్నారు. ధర్మ పరిరక్షణలోనూ ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని చిన జీయర్ స్వామి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శ్రీత్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి, శ్రీరామనామ క్షేత్రం అభివృద్ధి కమిటీ గౌరవ అధ్యక్షుడు తేజోమూర్తుల సుబ్రహ్మణ్యం, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వికాస తరంగిణీ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు కర్రి పాపారాయుడు, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు, జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు. ఆంధ్రాభద్రాద్రి ఇకపై తులగిరి శ్రీరామ దివ్య క్షేత్రంగా బాసిల్లుతుందని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త శ్రీత్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామి అన్నారు. ఆంధ్రాభద్రాద్రిని తులగిరి శ్రీరామక్షేత్రంగా నామకరణ చేశారు.

శ్రీరాముడి నామ స్మరణతో మార్మోగిన ప్రత్తిపాడు

ప్రత్తిపాడులో శ్రీరామపాదుకా పట్టాభిషేకం పూజా కార్యక్రమానికి విచ్చేసిన త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామి శ్రీరామ పాదుకలతో శోభాయాత్రగా ఆంధ్రాభద్రాదికి చేరుకున్నారు. ప్రత్తిపాడు మెయిన్‌రోడ్డు, అటవీశాఖ చెక్‌పోస్టు, జాతీయ రహదారి మీదుగా వేదిక వద్దకు చేరుకుంది. దారి పొడవునా జైశ్రీరామ్ నామ స్మరణలతో గ్రామం హోరెత్తింది. మేళతాళాలు, బాణసంచా కాల్పులు, కోలాటాల బృందం తదితర వాయిద్య బృందాలు ఈ యాత్రలో పాల్గొన్నాయి. కాగా చిన జీయర్ స్వామిని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ప్రత్తిపాడులో దర్శించుకున్నారు.